# ఉరితాడు

'రాజవీరు ఉరిపెట్టుకున్నాడు...' తెల్లవారక ముందే పారిశ్రామిక కాలనీలో వార్త గుప్పుమంది... అందరి ముఖాల్లోనూ ఆందోళన... ఎక్కడి పనులక్కడే వదిలేసి కార్మికులంతా రాజవీరు క్వార్టరు దిక్కు పరిగెత్తుతున్నారు... రాజవీరుకు అత్యంత సన్నిహిత మిత్రుడైన రంగయ్య మొదటి బజిలీ (ఫస్ట్ షిఫ్ట్) డ్యూటీకి తయారవుతున్నాడు... ఆ వార్త విని స్థాణువై నిల్చున్నాడు.... అదాతనికి షాక్ లాంటిదే... నిన్న సాయంత్రమే రాజవీరు రంగయ్యతో మాట్లాడాడు. ఇద్దరు కలసి టీ కొట్లో టీ తాగుతూ ఎన్నో విషయాలు మాట్లాడుకున్నారు... తన కెంతో ఆత్మీయుడైన రాజవీరు తెల్లవారేసరికి శవ మయ్యాడంటే రంగయ్యకు నమ్మబుద్ధి కావడం లేదు.

రంగయ్యతో ఎంతో ఉత్సాహంగా మాట్లాడాడు... అతన్ని తీసుకొని ఐదారుగురు మిత్రులింటికి వెళ్లాడు... వాళ్లతోనూ మాట్లాడాడు...

"ఏంటి విశేషం, అందర్నీ కలుస్తున్నావు...?" అడిగాడు రంగయ్య. "షిఫ్ట్ డ్యూటీలాయె...ఒకరు కలిస్తే ఒకరు కలువరు... చాలా రోజులాయె అలా కలుద్దామని..." అన్నాడు రాజవీరు.

మిత్రుడు అందర్నీ కలువడంలోని ఉద్దేశ్యాన్ని ఊహించను కూడా ఊహించలేని తనను తాను నిందించుకున్నాడు రంగయ్య...

నిన్న రాత్రి తనతో మిత్రులతో జోకులేస్తూ హాస్యంగా మాట్లాడిన రాజవీరు మాటల్లో గల వైరాగ్యాన్నప్పుడు గుర్తించలేదు రంగయ్య...

'మిత్రమా! ఎంత పని చేసావు...?' నుదురు కొట్టుకుంటూ తనలో తాననుకుంటూ ప్యాంటు వేసుకున్నాడు రంగయ్య.

"మీ చెల్లె పిచ్చిది... ఆమెకేం తెలువది. నేంబోతే ఫ్యాక్టరీ నుంచి ఇన్స్యూరెన్సు నుంచి వచ్చే పైసలు మీ చెల్లె కొచ్చేటట్టు చేయి. కూరగాయలకన్నా బయటకు పోలేదామె..." అన్నాడు రాజవీరు.

"నీ కేమైందని ఇలా మాట్లాడుతున్నావు...? హాస్యానికైనా ఓ పద్ధతుంటుంది... ఏం మాటలవి..." కోపంగా అన్నాడు రంగయ్య...

"నేనెందుకు పోతానోయ్... అలా మాటవరుస కన్నాను. నీలాంటి వాళ్ళనెంతో మందిని పంపించి కాని నేను పోను... అయినా చావుబతుకులు మన చేతిలో ఉన్నాయా...? సినిమా కని వెళ్ళిన భట్టాచార్య స్కూటర్ ఆక్సిడెంట్‌లో

చనిపోలేదా...? అందుకే అలా అన్నాను. నువ్వు పోయినా నేనీ పనులన్నీ చేస్తానులే..." నవ్వుతూ అన్నాడు రాజవీరు.

"చార్తియ్యి... అర్థంలేని మాటలు... నువ్వెక్కడికీ పోవు... నిక్షేపంగా నూరేళ్ళు బతుకుతావు..." అన్నాడు రంగయ్య.

వారం రోజుల క్రితం జరిగిన సంభాషణను జ్ఞాపకం చేసుకున్నాడు. 'రాజవీరూ! నిన్నర్థం చేసుకోలేక పోయాను...' కడుపులోంచి ఎగదన్నుకొస్తున్న దుఃఖాన్నాపుకుంటూ అనుకున్నాడు రంగయ్య.

గబగబా రాజవీరు ఇల్లు చేరుకున్నాడు...

ఇంటినిండా జనం... రోడ్డుమీద గుంపులు గుంపులుగా నిల్చొని జనం మాట్లాడుకుంటున్నారు... ముందు గదిలో రాజవీరు భార్య హృదయ విదారకంగా ఏడుస్తుంది... రంగయ్యను చూసామె మరీ ఏడుస్తుంది...

"వచ్చినావే అన్నా! మీ ఇద్దరు పానమసోంటి దోస్తులు గాదే అన్నా! మీ బావెళ్ళిపోయిండే అన్నా...!" వల్లిస్తూ రోదిస్తోందామె.

ఆమె ఏడ్పును చూస్తున్న రంగయ్యకూ దుఃఖ మాగలేదు... డొక్క లెగిసి పడుతుండగా భోరుభోరున ఏడ్చాడు... కొద్ది సేపటి తర్వాత తనను తాను ఓదార్చుకున్నాడు... రాజవీరు పిల్లలిద్దర్ని దగ్గరకు తీసుకున్నాడు..."ఊర్కో చెల్లే... ఊర్కో..." అని సత్తమ్మను ఊరడించాడు... పక్కగదిలో కెళ్ళాడు.

రాజవీరు శవం ఫ్యానుకు వేలాడుతుంది... మొలకు లుంగుంది... శరీరం మీద బనీనుంది. నాలుక భయంకరంగా బయటకు నెట్టుకొచ్చింది. మెడ దగ్గర కమిలిపోయుంది. చనిపోయింకా ఎక్కువ సేపు కానట్టుంది. ముఖంలో కళ తగ్గలేదు... తన మిత్రుడు శవమై వేలాడుతున్న దృశ్యాన్నిక చూడలేకపోయాడు రంగయ్య...వెనుదిరిగాడు...

"అదోటిదోటి మాట్లాడుకుంటున్నాం... పడుకునేవారకు బాగ రాత్తిరయింది... ఐదు గంటల కనుకుంట లేచి మూత్రానికని పోయిండు... మల్ల కన్నంటుకుంది నాకు... తెలవారెవరకు మంచంల లేడు...స్టోర్ రూం దిక్కు సూసిన – నా పానమయుసిపెయింది... అక్కన్నే కూలబడి మొత్తుకునుడు వెట్టిన... పిల్లలు లేచి తలుపుల్దీసింద్రు..." వెక్కి వెక్కి ఏడుస్తూ చుట్టూ కూర్చున్న ఆడవాళ్ళతో చెబుతుంది సత్తమ్మ...

"రాజవీరు ఎంతో మంచోడుండె..."

"ఎవ్వల జోలికి పోయెటోడు గాదు రాజవీరు..."

"తన డ్యూటేందో... ఇల్లేందో... పిల్లలేందో..."

"మంచి వాళ్ళకే తొందరగా చావొస్తది. మందిని ముంచి బతికే వాళ్ళకు, తాగుబోతులకు ఎక్కువ ఆయుష్షు పెడతాడు దేవుడు..."

అందరి మాటలు వింటున్నాడు రంగయ్య...

దూరంగా ఉన్న బండమీద ఒంటరిగా కూర్చున్నాడు... ఎంతో మంది వస్తున్నారు...

కొందరు చూసి వెళ్ళిపోతున్నారు... కొందరు అక్కడే నిల్చొని మాట్లాడుతున్నారు... చాలామంది రాజవీరు మంచితనం గూర్చే చెప్పుకుంటున్నారు...

"ఇది ఆత్మహత్య కాదనిపిస్తోంది నాకు..."

"భలే చెప్పొచ్చావు తియ్యి... ఎదురుగా కనబడుతుంటే ఆత్మహత్య కాదంటావేంటి...? అయినా అతన్ని చంపవలసిన అవసర మెవరికుంది...?"

"మరి ఆత్మహత్య చేసుకోవాల్సినవసరం రాజవీరు కేమొచ్చింది...?"

"ఎవరి మనసు లేముందో ఎవరికి తెలుసు...? మన ఫ్యాక్టరీ మూతపడ్తుందని భయపడ్డాడేమో...?"

"అవునవును. ఫ్యాక్టరీ మూతబడితే బతకడమెలాగని నాతో చాలా సార్లన్నాడు..."

"రాజవీరెందుకు చనిపోయుంటాడు? అతని కంత కష్టమొచ్చింది?" అనుకుంటున్న రంగయ్యకు వాళ్ళనుకుంటున్న మాటలు చెవిలో పడ్డాయి.

"ఏనుగు చచ్చినా పదివేలు, బతికినా పదివేలన్నట్టు మనం అంటే ఎఫ్.సి.ఐ. ఉద్యోగులం చచ్చినా లక్షలే బతికినా లక్షలే... మనం చచ్చినా మన పిల్లలకు తిండికైతే ఢోకా ఉండదు..." అన్నాడు మూడు నెలల క్రితం రంగయ్యతో రాజవీరు...

"ఎందోయ్ తొందరగా పోవాలనుందా...? అలా మాట్లాడుతున్నావ్...?" అన్నాడు రాజవీరుతో రంగయ్య...

"మిమ్మల్నొదలి నేనెందుకు పోతానోయ్...? నిజానికి మనం రిటైరయ్యేదాక పని చేసినా అన్నీ కలుపుకొని మూడు మూడున్నర లక్షలొస్తాయేమో... అదే సర్వీసులో ఉన్నప్పుడు చనిపోతే ఇన్సూరెన్సు, గ్రూపు ఇన్సూరెన్సూ, డెత్ బెనిఫిట్ స్కీం, గ్రాట్యుటీ, పి.ఎఫ్... అన్నీ కలుపుకుంటే నాలుగు లక్షలు పైన్నే వస్తాయి... ఇంట్రెస్టుతో పిల్లలు బతకొచ్చు..."

"ఎందుకు పిచ్చి పిచ్చిగా లెక్కలేస్తున్నావు...? మనిషి లేని లోటును తీర్చడమెంత సాధ్యమో నీకు తెలియదనుకుంటా... ఒక్క పూటకు తిన్నా సరేకాని భార్యా పిల్లలతో కలిసి బతికితే అది వేరే విషయం..."

"కాదని ఎవరన్నారు...? అలా మాట వరుసకన్నాను... మొత్తంమీద ప్రకాశరెడ్డి తాను చనిపోయి కుటుంబాన్ని బతికించాడు... అతనే బతికుంటే ఈ పాటికి మెడలబంటి అప్పుల్లో కూరుకుపోయుండేవారు. అతడు ఆక్సిడెంటులో పోవడం వల్ల వచ్చిన డబ్బుతో భార్యాపిల్లలు హాయిగా బతుకుతున్నారు..." అన్నాడు రాజవీరు...

"ఏంటీ, నువ్వీ మధ్య విచిత్రంగా మాట్లాడుతున్నావు...? చావని, బతుకని ఏదేదో వాగుతున్నావు...? ఇరవై ఏళ్ళకు పైగా కార్మికుడిగా పనిచేస్తున్న వ్యక్తి మాట్లాడే మాటలివేనా...? కొంపదీసి ఫ్యాక్టరీ పోతే సన్యాసిని కావు గదా...!" అన్నాడు రంగయ్య...

"మీ చెల్లె నిడిసిపెట్టి నేనెందుకు సన్యాసి నవుతానోయ్...? వత్తిగనే అన్నాను..." మాట మారుస్తూ అన్నాడు రాజవీరు...

రాజవీరుతో జరిగిన సంభాషణ జ్ఞాపకం వచ్చి రంగయ్య మనసు భారమైంది...

'రాజవీరూ! నువ్వన్నంత పనీ చేసావు... ఫ్యాక్టరీ పోతే బతుక లేననుకున్నావా...? మనిషి పుట్టింది కడుపుతో మాత్రమే కాదు... పనిచేయడానికి రెండు చేతుల్తోనూ పుట్టాడు...' తనలో తాననుకున్నాడు రంగయ్య. అతని కళ్ళవెంట పటపటా నీళ్ళు కారాయి...

అక్కడి కొచ్చిన అందరూ ఆందోళనపడటం గమనించాడు రంగయ్య... గత రెండు మూడేళ్ళుగా ఆ కాలనీలో పెనుగులాటను చూస్తున్నాడు... అందరిలోనూ ఎప్పటికైనా ఫ్యాక్టరీ పోవాల్సిందేనన్న వైరాగ్య భావం గమనించాడు... కళకళలాడుతూ చుట్టు ప్రక్కలవాళ్ళకు అసూయ కలిగేలా ఉండే కాలనీ వాసులు ఎప్పుడేమవుతుందోనన్న భయంతో బిర్రబిగుసుకు పోయుండటం రంగయ్య జ్ఞాపకం చేసుకున్నాడు...

"రంగయ్యా! ఇరవై ఏళ్ళకు పైగా మన విలువైన జీవితాన్ని ఫ్యాక్టరీకే ధారబోసాం. మన శరీరంలోని రక్తమాంసాలను, శక్తినంతా యంత్ర భూతాలకే అంకితం చేసాం... రసాయనాలు, విషవాయువులు పీల్చి పీల్చి మన శరీరాలు రోగాలకుప్పలయ్యాయి. మనమిప్పుడు గానుగాడించి నూనె తీసిన తెలకపిండిలా ఉన్నాం. రసం తీసిన చెరుకు పిప్పిలా ఉన్నాం. ఫ్యాక్టరీ బందయితే ఏం చేసి బ్రతకడం...?" అన్నాడు రాజవీరు...

"వి.ఆర్ (వాలంటరీ రిటైర్‌మెంట్) రూపంలో ఎంతో కొంత డబ్బొస్తుంది కదా...! ఆ డబ్బు తీసుకొని ఏదైనా ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చూసుకోవాలి..." అన్నాడు రంగయ్య...

"చేసిన సర్వీసుకు నెలన్నర జీతం చొప్పున మనకు ముప్పై నెలల జీతం వస్తుంది... అదేమూలలకు సరిపోతుంది...? ఉద్యోగం పోయినవాడికి మళ్ళీ ఉద్యోగమిచ్చే దెవరు...? ఒకేసారి లక్షలాది మంది కార్మికులు వీధుల్లో పడుతుంటే వీళ్ళందరికీ ఉద్యోగాలెలా లభిస్తాయి...? పైగా మన వయసు నలభైదాటింది... మన ఫ్యాక్టరీలో ఉన్న చాలామంది మన ఏజ్ గ్రూపువాళ్ళే... ! నలభై దాటినవాళ్ళకు ఉద్యోగాలు దొరకడం చాలా కష్టం... మనకి పని తప్ప వేరే పని రాదు... ఇన్నేళ్ళుగా ఈ పనిచేసి, కొత్తగా మరేం చెయ్యగలం...? పోగా ఎదుగుతున్న పిల్లలు... చదువులకోసం వాళ్ళను బయటకు పంపాల్సిన సమయం... ఉద్యోగం లేకుంటే ఇవన్నీ ఎలా...?" భయం భయంగా అన్నాడు రాజవీరు...

"భయపడి చేసేదేం లేదు... అందరికేం జరుగుతే అదే మనకు జరుగుతుంది. అయినా, ఏ ప్రభుత్వమయినా ఏటా కోట్లాది నష్టాలనెలా భరిస్తుంది...?"

"నాకు తెలియకడుగుతానోయ్ రంగయ్యా! ఈ నష్టాల కెవరు బాధ్యులు...? ఇందులో కార్మికుల బాధ్యతెంతుందో చెప్పు...? మనమేమన్న పని చేయనన్నామా...? సమ్మెలవీ చేసి ఉత్పత్తికి భంగం కలిగించామా...? మరెందుకోసమని మనం బలిపశువులం కావాలి...? ఫ్యాక్టరీ బందు చేసి మన ఉద్యోగాలు పీకేస్తేకాని, ప్రభుత్వం కండ్లు చల్లబడవా...?"

ఓసారి రాజవీరుతో జరిగిన సంభాషణను జ్ఞాపకం చేసుకున్నాడు రంగయ్య......

"ఇక్కడేం చేస్తున్నావోయ్...? పనులు తొందరగా ముగిద్దాం..." రంగయ్య దగ్గరకొచ్చి అన్నాడు సంతోష్.

"పోస్టుమార్టం అయ్యేవరకు మనమేం చేసేది లేదుకదా...! పోలీసుల దగ్గరి కెవరైనా వెళ్ళారనుకుంటాను..." అన్నాడు రంగయ్య.

"వెళ్ళారు... ఎన్.టి.పి.సి. నుంచి రావాలి కదా...! వస్తున్నారేమో...!" అంటూ వెళ్ళిపోయాడు సంతోష్...

రంగయ్యక్కడే తలపట్టుకొని కూర్చున్నాడు...

ఎవరెవరో వచ్చి చూసి పోతున్నారు. ఎవరికి తోచినట్టుగా వాళ్ళు వ్యాఖ్యానిస్తున్నారు... జెనరల్ మేనేజర్, చీఫ్ పర్సనల్ ఆఫీసర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఫైనాన్స్ మేనేజర్, చీఫ్ ఇంజినీయర్ల లాంటి పెద్దలు వచ్చారు... వాళ్ళ వెంబడే ట్రేడ్ యూనియన్ నాయకులు, ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులున్నారు... వాళ్ళ చుట్టూ కార్మికులంతా మూగారు... కొందరు రాజవీరు భార్యా పిల్లల నోదారుస్తున్నారు...

ఆ నాయకులపై రంగయ్య కేమాత్రం సదభిప్రాయం లేదు. ఇరవై ఏళ్ళ క్రితం రంగయ్యవాళ్ళు ట్రేనింగ్ పూర్తి చేసుకొని ఉద్యోగంలో చేరిన కొత్తలో చక్కని ట్రేడ్ యూనియన్ మూమెంటుండేది. కార్మికులంతా దేనికంటే దానికి సిద్దంగా ఉండేవారు. నాయకులెంతో ఆదర్శంగా ఉండేవారు... క్రమక్రమంగా వాళ్లలో స్వార్థం పెరిగింది. ముఠాకక్షలు పెరిగాయి... సంపాదనపై మోజు పెరిగింది. కార్మికుల ప్రయోజనాలను కాలరాచే ఒప్పందాలను చేయడానికి వారేమాత్రం వెనుకాడడం లేదు. కార్మిక ప్రయోజనాల ముసుగు కింద వాళ్ళ వ్యక్తిత్వాలకు భంగం కలిగించే ఎన్నో అవమానకరమైన అగ్రిమెంట్లపై సంతకాలు పెట్టారు వారు...ఇప్పుడు వాళ్ళ ఆస్తులు గణనీయంగా పెరిగాయి... కొందరివైతే మిలియన్లలో ఉన్నాయి.

శవాలపై ప్యాలాలేరుక తింటున్నట్టు చివరిదశలో ఉన్న ఫ్యాక్టరీని రక్షించుకునే పోరాటాలు చేయడానికి బదులు అందినంతవరకు సంపాదించు కోవడానికి ప్రయత్నిస్తున్నారు... ఒక్క సంవత్సరం నాయకుడిగా ఎన్నికైతే కొన్ని లక్షలు సంపాదించుకున్నట్టే...

ఇలాంటి వారికి ఫ్యాక్టరీ ఉంటేం...? పోతేం...? అనుకున్నాడు రంగయ్య.

"ఛీ నీయవ్వ...! బీదలపాట్లు నవలలో శవాలమీద బంగారు నగలొలుచుకునే కిరాతకుల్లాంటివారు మీరు..." ట్రేడ్ యూనియన్ నాయకుల గూర్చి అనుకున్నాడు రంగయ్య...

"రంగన్నా! పనులు కానిద్దామా...?" అంటూ దగ్గరికొచ్చాడు రమేష్...

"అవెంత సేపు... ఇంకా పోలీసులే రాలేదు కదా...! పోస్టుమార్టంకు రామగుండం ప్రభుత్వాసుపత్రికి తాసుకెళ్ళాలేమో...! పనులన్నీ ముగిసే సరికెలాగూ సాయంత్రమవుతుంది..." అన్నాడు రంగయ్య నిల్చొని...

"అవునవును పాపం, రాజవీరు అన్యాయంగా చనిపోయాడు..." కళ్ళు నీళ్ళు తీసుకుంటూ అన్నాడు రమేష్...

"అన్యాయమేముంది...? రాజవీరన్న చనిపోవాలె...ఇంకా చాలామంది చనిపోవాలె... చనిపోకుంటెట్ల బతుకుతరు...? బతికేం జేత్తరు...? నీ యవ్వ, చచ్చిందే నయ్యముంది.

నా మాట నిజం... ఇంకెంతమంది చస్తరో చూడుండ్రి... కార్మికుల చావుకే వచ్చిందిదంతా...నడగండ్లె బొండిగ గోసినట్టు చెయ్యవట్టిరి... గిప్పుడు గీ ఎటుగాని వయసుల నౌకర్లేదు పొమ్మంటె మేమంతెక్కడికి పోవాలె...? ఏ గంగలడి సావాలె...? నౌకరి పోయినంక రోడ్డుమీద పడుడే కద...! గిప్పుడు అంతర్గాం కార్మికులోలె, కాగజ్‌నగర్ కార్మికులోలె ఆకలి చావు చచ్చుడుకంటె గిట్ల చచ్చుడు నయ్యంగదా...! ఇప్పుడు సత్తె ఇన్నన్ని పైసలన్న దొరుకుతయి. బంగారమసొంటి రాజవీరన్నను చంపిందెవరు...? బతుకలేక చచ్చిండు రాజవీరన్న... భయపడి చచ్చిండు... రాజవీరన్నా! నువ్వెందు కురిపెట్టుకున్నవే...! ఈ వ్యవస్థ కురిబెట్టాల్నే... అయ్యో రాజవీరన్నా... నువ్వెందుకు చచ్చినవే..." హిస్టీరిక్‌గా అరుస్తూ, కేకలేస్తూ, ఏడుస్తూ అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు శంకరయ్య... అతడు రాజవీరుతో పనిచేసే కార్మికుడు... ఎప్పుడూ తాగుంటాడు... అయితే, అతని మాటల్లో నగ్నసత్యాలుంటాయి...

"ఎవడ్రా నా రాజవీరన్నను చంపింది... బుద్ధివంతుడు నా అన్న... పనినే దైవ మనుకున్నడు... నా అన్నను చంపినోడు సర్వ నాశినమైతడు... దుంపనాశినమైతడు... ఈ ఫ్యాక్టరీ నౌకరి పాడుగాను. ఇంకెందర్ని చంపుద్దో...? ఎంత మందిని దుంపనాశినం జేత్తదో...? నష్టాలత్తే మేమేం జెయ్యాలె...? తిని బల్సినోల్ల నడుగాలె...! ఎవ్వలు నడుపియ్యమన్నరు...? ఎవ్వలు బందుజెయ్యమన్నరు...? ఉచ్చెతారుతంగ సత్తివి గదనే రాజవీరన్న...! ఉరిబెట్టుకోవల్సింది నువ్వు కానే కాదే రాజవీరన్న..." గొడగొడ ఏడుస్తూ మొత్తుకుంటున్నాడు దాసు...దాసు రాజవీరు కొలీగ్... తాగడంలో శంకరయ్యతో పోటీపడతాడు...

రాజవీరును జ్ఞాపకం చేసుకుంటూ కొందరేడుస్తున్నారు... కొందరటూ ఇటూ తిరుగుతూ మాట్లాడుకుంటున్నారు... మరికొందరు చేయాల్సిన పనుల గూర్చి ప్రయత్నాలు చేస్తున్నారు...

రంగయ్య కేం చేయడానికీ కాలు చేయాడటం లేదు. ప్రాణమిత్రుడితో కలసి గడిపిన జీవితం జ్ఞాపకం వస్తుంటే దుఃఖమాగడం లేదు. హృదయంలో చేయిపెట్టి కెలికినట్టవుతుంది... రాజవీరు జ్ఞాపకాల్లో కదిలి అతని మనసెక్కడెక్కడో తిరుగుతుంది.........

రాజవీరు, రంగయ్య ఒకే ఊరివాళ్ళు. ఇద్దరివీ వ్యవసాయ కుటుంబాలే... ఒంటి నాగలి వ్యవసాయంతో సతమతమవుతుండేవారు వాళ్ళ తల్లితండ్రులు...కొడుకులను చదివించాలనుకున్నారు. రాజవీరు చదువులో చురుకైనవాడే...

"నా కొడుకును ఇంజనీర్ చదివిస్తా..." అనేవాడు రాజవీరు తండ్రి... రంగయ్య, రాజవీరు ఎస్. ఎస్.సి.పూర్తి చేసి సుల్తానాబాద్‌లో ఇంటర్ చదువుతున్నారు. అప్పుడే రామగుండంలో కొత్తగా స్థాపింపబడుతున్న ఎరువుల ఫ్యాక్టరీలో క్రాఫ్ట్‌మన్ ట్రెయినీ కోసం రమ్మని వాళ్ళకు కాల్ లెటర్స్ వచ్చాయి...

"అది బస్తాలు కుట్టే నౌకరి...పోవద్దు..." అన్నారు కొందరు... ఊరి హెడ్మాస్టర్ రాజవీరు, రంగయ్యలను వాళ్ళ తండ్రులను పిలిపించుకొని ఇలా చెప్పాడు:

"మీవా వ్యవసాయకుటుంబాలు. అవీ ఒంటి నాగలి వ్యవసాయాలు. ఇంటర్

తర్వాత ఇంజనీరింగ్‌లో సీట్లు దొరుకుతాయన్న నమ్మకం లేదు... దొరికినా అంత ఖర్చుపెట్టి హైదరాబాద్‌లో చదివించడం మీ నుంచి అవుతుందనుకోను... ఇప్పుడొచ్చిన కాల్ లెటర్ మంచుద్యోగానికే... సెలక్టవుతే మూడు సంవత్సరాల ట్రెయినింగ్... ఆ తర్వాత టెక్నీషియన్‌గా ఉద్యోగం... జీతం దాదాపు హెడ్మాస్టర్ స్కేలు. .. చిన్నతనంలో దొరుకుతున్న ఉద్యోగం... రేపటి కోడికంటే ఇవ్వాల్టి గుడ్డే నయమన్నారు... ఈ కాలంలో ఉద్యోగాలు దొరకడం చాలా కష్టం... అందువల్ల వాళ్ళ నింటర్వ్యూలకు పంపండి... దొరికితే చేరిపోవడమే మంచిది... అంతగా చదువుమీద ఇష్టముంటే ఉద్యోగం చేస్తూ కూడా ఇంజనీరింగ్ చేసుకోవచ్చు..."

ఆ మాటలు విని ఇంటర్వ్యూ కెళ్ళారు. సెలక్టయ్యారు.

గోరఖ్‌పూర్‌లో మూడు సంవత్సరాలు ట్రెయినింగ్ తీసుకున్నారు. మెకానికల్, టెక్నీషియన్లుగా జాయినయ్యారు... త్వరలోనే మంచి వసతులున్న క్వార్టర్ దొరికింది...

తర్వాత పెళ్ళయింది... పిల్లలయ్యారు... జీవితం సాఫీగానే సాగుతుంది. జీతం ఫర్వాలేదు... డ్యూటీ, అప్పుడప్పుడు ఓవర్‌టైమ్... భార్య, పిల్లలు, ఇంటి పనులు, ఇంటికి తగిన వస్తువులు సమకూర్చుకోవడంలాంటి పనులతో చాలామంది కార్మికుల్లా రాజవీరు కూడా క్వాలిఫికేషన్ పెంచుకోలేదు. మొదట్లో అక్కడ మంచి ట్రేడ్ యూనియనిజముండేది. తర్వాత అదీ పోయింది... కార్మికులకు మధ్యతరగతి మనస్తత్వం అలవడింది... అలసత్వం ప్రవేశించింది... వాళ్ళలో చాలామంది ఎక్కన్నుంచైతే వచ్చారో ఆ పల్లెలనే మరచిపోయారు... తల్లితండ్రులకూ దూరమయ్యారు... ఏదేమైనా వాళ్ళ జీవితం మాత్రం హాయిగానే గడుస్తుంది...

చాలా ప్రభుత్వ రంగ సంస్థల్లాగానే ఈ ఫ్యాక్టరీ కూడా నష్టాల్లో నడుస్తుందన్న మాటలు వినరాసాగాయి. ఉత్పత్తి గణనీయంగానే ఉన్నా నష్టాలెందుకొస్తున్నాయో రాజవీరులాంటివాళ్ళ కర్థమయ్యేది కాదు.

ఇరవై ఏళ్ళు గడిచాయి... ఈ మధ్య ఎన్నో ప్రభుత్వాలు మారాయి... ఈసారి వచ్చిన ప్రభుత్వం నూతన పారిశ్రామిక, ఆర్థిక విధానాన్ని ప్రవేశపెట్టింది. నష్టాల్లో నడుస్తున్న ఫ్యాక్టరీలను మూసివేస్తానంది...

అప్పట్నుంచి ఆ కాలనీ కార్మికుల గుండెల్లో రైల్లు పరుగిడుతున్నాయి... ఎప్పుడూ కళకళలాడుతూ ఉండే టౌన్‌షిప్ వెలవెలబోతుంది... ఒక్కొక్కటిగా - జీతం తప్ప అన్ని సౌకర్యాలూ బందు చేసారు. కార్మికుల్లో బతుకు భయం ప్రవేశించింది... కార్మిక నాయకులు, ప్రజానాయకులు రోజుకో తీరు ప్రకటనలతో కార్మికులను మరింత వణికిస్తున్నారు...

కొంత మంది కార్మికులు షేర్ మార్కెట్లోకి, మరికొందరు చిన్న చిన్న వ్యాపారాల్లోకి దిగినా రాజవీరులాంటి సిన్సియర్ ఉద్యోగులు జీతం పైన ఆధారపడే బతుకుతున్నారు. రోజూ షాపింగ్ సెంటర్ దగ్గరున్న చెట్ల దగ్గర ఫ్యాక్టరీ భవిష్యత్తు గూర్చి మాట్లాడుకుంటున్నారు...

మూడు వారాల క్రితం జరిగిన సంభాషణను జ్ఞాపకం చేసుకున్నాడు రంగయ్య...

"పూలమ్మిన చోటే కట్టెలమ్ముకునే కాలం వచ్చేట్టు కనబడుతుంది పరిస్థితులను చూస్తుంటే... మన ఫ్యాక్టరీకి డబ్బివ్వమని తేల్చి చెప్పేసారట కదా..." అన్నాడు రాజవీరు

"ఇంకెక్కడి ఫైనాన్షియల్ సపోర్ట్...? బి.ఐ.ఎఫ్.ఆర్. మన ఫ్యాక్టరీని సిక్ యూనిట్‌గా ప్రకటించింది... ఐ.సి.ఐ.సి.ఐ. కూడా అంతే చేసింది. మన ఫ్యాక్టరీ మూతపడడం ఖాయం..." అన్నాడు సతీష్...

బి.ఐ.ఎఫ్.ఆర్. పేరు వింటేనే వణికిపోతున్నారు కార్మికులు... సతీష్ మాటలు విన్న రాజవీరు ముఖంలో కత్తివేటుకు నెత్తురు చుక్క లేదు.

"మూసివేయకేం చేస్తారు...? ఏటా నష్టం కోట్లలోనాయె..." అన్నాడు మరో కార్మికుడు...

"డిప్రిషియేషన్ వాల్యూలంటూ వేలకోట్లమీద లెక్కలు గడితే నష్టాలు గాకేం వస్తాయి...? అయినా, ఫ్యాక్టరీలు పెట్టింది వ్యాపారానికా...? ఉద్యోగ సౌకర్యం కల్గించడానికా...?" అన్నాడు రాజేశం...

"మాటలు బాగానే చెప్పొచ్చు... కొంతమంది ఉద్యోగాల కోసమని ప్రతి ఏటా కోట్లు నష్టం భరించాలంటారు... అప్పుడు దేశమేం కావాలి...?" అన్నాడు అనిల్...

"దేశం గూర్చి నీకొక్కనికే పట్టింపుంది తియ్యి... జర్మనీ వాళ్ళు మనమీద చేస్తున్న ప్రయోగమిది. అందుగ్గూడ మనమే బాధ్యులమా...?" అన్నాడు రాజేశం.

"కాకపోవచ్చు...కాని ఫ్యాక్టరీ నష్టాలకు మన బాధ్యతా కొంతుంది... మనం కార్మికులమే... కాని కార్మికులమన్న స్పృహ మనలో ఎవరికైనా ఉందా...? రైతు భూమిని ప్రేమించినట్టు మనం మన ఫ్యాక్టరీని ప్రేమించాలి... మన పనిముట్లను ప్రేమించాలి... కాని మనం ఓ.టి.ని ప్రేమించాం... డ్యూటీ అంటే లక్ష్యపెట్టనే లేదు..." అన్నాడు అనిల్...

"కావచ్చు...కాని, కోట్లాది నష్టాలకు కార్మికుల బాధ్యత చాలా స్వల్పమే... సబ్‌స్టాండర్డ్ మెటీరియల్, నిధుల దుర్వినియోగం, దేని కెవరూ బాధ్యత వహించకపోవడం, బొగ్గు, కరెంటు సరఫరా సరిగ్గా లేకపోవడం లాంటి సవాలక్ష కారణాలున్నాయి... కర్ణుడి చావుకెన్ని కారణాలున్నాయో మన ఫ్యాక్టరీ ఈ స్థితికి రావడానికన్ని కారణాలున్నాయి." అన్నాడు రాములు.

"ఏదేమైనా బలిపశువులం కాబోతుంది మాత్రం మనం" అన్నాడు రాజవీరు.

"అవును...రాజవీరు పాపం చాలా భయపడ్తున్నట్టున్నాడు... మూస్తే మూసారు కాని, మనకు సరిపోయేంత కాంపెన్షేషన్ ఇస్తే బాగుండేది..."

"ఇప్పుడున్న వి.ఆర్. కంటె ఎక్కువేమివ్వరు..." అన్నాడు రంగయ్య...

"మన ప్రక్కనే ఉన్న అంతర్గాం కార్మికుల పరిస్థితి చూస్తూనే ఉన్నాం మనం... పొట్ట కూటి కోసం స్త్రీల వ్యభిచారాలు, కార్మికుల ఆత్మహత్యలు, ఆకలి చావులు పేపర్లో చదువుతూనే ఉన్నాం... అలాగే కాగజ్‌నగర్ కార్మికులు కూడా... వాళ్ళను తలుచుకుంటుంటే నాకు మనసు మనసులో ఉండటం లేదు... రేపు మనం

కూడా అలాగేనే అన్న ఆలోచనే భయంకరంగా ఉంది..." కనుగుడ్లనిండా నీళ్ళతో అన్నాడు రాజవీరు.

"ఏంగాదు లేవోయ్..." అన్నాడు జగదీశ్.

"మరి యూనియన్లన్నీ ఏం చేస్తున్నట్టు...?"

"వాళ్ళు చేసేది వాళ్ళు చేస్తున్నారు. కొన్ని యూనియన్లు తీవ్రంగా పెనుగులాడుతున్నాయి. కాని, చాలా యూనియన్లు తొత్తులు గానే వ్యవహరిస్తున్నాయి. దేశంలో ప్రస్తుతం ట్రేడ్ యూనియన్ మూమెంటెక్కడుంది...?" అన్నాడు జగదీశ్.

రాత్రయిందని అంతా లేచిపోయారు.

"రంగయ్యా! మనమోరకం జీవితాని కలవాటు పడ్డాం... ముఖ్యంగా మన ఆడవాళ్ళు ఈ జీవితానికి, ఈ సుఖాలకు భిన్నమైన జీవితం గడపడానికి చచ్చినా ఒప్పుకోరు...మన ఉద్యోగాలు పోతే ఈ జీవిత మెలా దొరుకుతుంది... మీ చెల్లె పరిస్థితులతో రాజీపడదని నా భయం... పడదు కూడా... ఆమె స్వభావం నాకు తెలుసు..." అన్నాడోసారి రంగయ్యతో రాజవీరు...

"మనం చచ్చైనా పిల్లలను బతికించాలి... మనం చచ్చి కుటుంబాన్ని బతికించాలి..." మాట వరుసకంటూనే, నవ్వుతూనే ఎన్నోసార్లు రాజవీరు తనతో అన్న మాటలు రంగయ్య చెవుల్లో గింగురుమంటున్నాయి.

రంగయ్య కళ్ళవెంట ధారాపాతంగా నీళ్ళు... మిత్రుని చేష్టలన్నీ జ్ఞాపకం వచ్చి గొడగొడా ఏడుస్తున్నాడు... లేచి ముందు గదిలో కెళ్ళాడు...

ఈలోగా పోలీసులొచ్చారు... శవం ఫోటోలు తీశారు.

గదిని ఫోటో తీశారు. శవాన్ని పరీక్షించారు... పోస్టుమార్టం కోసం రామగుండంకు తీసుకుపోవాలంటున్నారు... ట్రేడ్ యూనియన్ నాయకులు, జి.ఎమ్. వారితో మాట్లాడుతున్నారు.

"అయ్యా పోలీసులూ! మీరు కూడా గవర్నమెంటోల్లే కద! ఇగో... ఇక్కడ చావులు మొదలైనయి... ఫ్యాక్టరీ పోతే ఇంకెంతో మంది పోతరు! పోకుంటం జెయ్యుమంటరు...? ఇదువరకే లక్షలల్ల కోట్లల్ల మంది నౌకర్లు లేక రోడ్లమీన తిరుగుతంద్రు... మమ్ముల్ను గూడ తీసేసి ఇంకొన్ని లక్షలను కలుపుంద్రి... లాభాల్లేవట లాభాలు...! లాభాల్లేకుంటె వచ్చేటట్టు జూడాలె... కార్మికులను చంపి లాభాలు తీస్తరా...? తియ్యంద్రి..." అరుస్తున్నాడు దాసు...

"దాసూ! నువ్విట్రా..." అని దూరం తీసుకెళ్ళారతన్ని...

పోలీసులు, కార్మికులు కలిసి శవాన్ని కిందికి దించారు... లుంగీలోంచి మలిచున్న కాగితం కిందబడింది... దాన్ని విప్పి చదువసాగాడు సబ్ ఇన్స్పెక్టర్...

"కార్మిక సోదరులకు నమస్కారాలు. నా చివరి వీడ్కోలు... ఇరవై ఏళ్ళకు పైగా నన్ను పోషించిందీ కర్మాగారం... కాని ఇంకో ఆర్నెల్లలోనో, ఇంకా ముందో మూతపడబోతోంది... ఫ్యాక్టరీ మూతబడితే నాకైతే బతకడం కష్టంగానే తోస్తుంది...

నేను పిరికివాన్ని... నిజమే... ఎలాగోలా మా బతుకొచ్చు... కాని అలా బతకడం నాకిష్టం లేదు... అందుకే నేను ఆత్మహత్య చేసుకుంటున్నాను... అట్లని నా జీవితం ఎవరికీ ఉదాహరణ కాకూడదు. అయితే గియితే కనువిప్పు కావాలి... మన ఫ్యాక్టరీ ఈ స్థితికి కార్మికులెంతవరకు బాధ్యులో ఒక్కసారి ఆలోచించమని పెద్దలకు విజ్ఞప్తి చేస్తూ సెలవు తీసుకుంచున్నాను...

మీ
రాజవీరు"

అక్కడున్న వాళ్ళందరి హృదయాలు భారమయ్యాయి...

అతని మిత్రులైతే గోదుగోడున ఏడుస్తున్నారు.

పోస్టుమార్టం కోసం శవాన్ని రామగుండంకు తీసుకెళ్ళారు. పని పూర్తయి గోదావరి ఒడ్డున దహనక్రియలవీ అయ్యేసరికి చీకటి పడింది.

ఇదివరకే భయం భయంగా ఉన్న కార్మికులందరి ముఖాల్లోనూ మరింత భయం చోటు చేసుకుంది.

'రాజవీరూ! ఉరి పెట్టుకోవాల్సింది నువ్వుకాదు. అసలీ ఉరితాడెవరి చేతిలో ఉంది...? సృష్టికర్తలమైన మన చేతుల్లో ఉంచుకోకుండా ఎవరి కప్పజెప్పాం...? నిజానికీ ఉరితా డెవరి చేతుల్లో ఉన్నట్టు?'

రకరకాలుగా ఆలోచిస్తూ ఇల్లు చేరుకున్నాడు రంగయ్య.

ఆ రాత్రి ఆ కాలనీలో ఎవరికంటిమీదా కునుకులేదు...

ఇక వాళ్ళ కండ్లమీద రెప్పవాలడం కష్టమే...! అలాంటి కాలనీలు దేశం మొత్తంమీద వందలాదిగా ఉన్నాయి...

● ఆదివారం విశాలాంధ్ర, *1995*, మార్చి ●

★ ★ ★